ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5



కర్ణాటక వార్తలు

బుధవారం 24 సెప్టెంబరు 2025

గోకర్ణనాథేశ్వరుడి ఆలయం జిగేల్..!

బెంగళూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళూరులో ప్రసిద్ధి చెందిన కుద్రోలిలో వెలసిన గోకర్ణనాథేశ్వర ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా కుద్రోలి వీధులలో ఏర్పాటు చేసిన వెలుగులు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి.



విద్యుద్దీపాల వెలుగులో గోకర్ణనాథేశ్వర ఆలయం



బళ్లారి ఎస్ఎల్వీ ఆలయంలో భీమవరం మావుళ్లమ్మ అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు



బెంగళూరులో బ్రాహ్మి అలంకరణలో విద్యారణ్యపుర కాళికాదుర్గా పరమేశ్వరి

కులగణనపై విచారణ

నేటికి వాయిదా

● హైకోర్టులో కొనసాగుతున్న వాదోపవాదాలు



బెంగళూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ కమిషన్ ఆధ్వర్యంలో సాగుతున్న సామాజిక, విద్య స్థితిగతుల సమీక్షకు సంబంధించి రాష్ట్ర ఒక్కలిగల సంఘం, అఖిల కర్ణాటక బ్రాహ్మణ మహాసభ సంబంధించి పిల్‌ను హైకోర్టు మంగళవారం సుదీర్ఘ విచారణ సాగింది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది. అర్జీదారుడు బీఆర్ ఉదయ్‌శంకర్ తరపున సీనియర్ న్యాయవాది ప్రభులింగ నావదగి వాదనలు వినిపించారు. సమీక్షకు సంబంధించి రాష్ట్రప్రభుత్వం రెండు ఆదేశాలు జారీ చేసిందని, దీంతోపాటు బీసీ కమిషన్ హ్యాండ్‌బుక్ సిద్ధం చేసిందన్నారు. ఆధార్‌కార్డు, మొబైల్ నెంబరు ఇవ్వడాన్ని తప్పనిసరి చేసిందన్నారు. కుటుంబ సభ్యులందరి ఆధార్ నెంబర్లు ఇవ్వాలని పేర్కొన్నారన్నారు. రాష్ట్రప్రభుత్వానికి ఇలాంటి సర్వేకు అధికారం లేదని వాదించారు. కాగా రాష్ట్రప్రభుత్వం తరపున అభిషేక్ మనుసింఘ్వి వాదనలు వినిపించారు. సామాజిక, ఆర్థిక సమీక్ష వల్ల ప్రభుత్వం తమ తదుపరి సంక్షేమాలు రూపొందించేందుకు వీలు కానుందన్నారు.

వాహన సంచారానికి అవకాశం ఇవ్వండి

● ట్రాఫిక్ రద్దీ వేళల్లో విప్రో క్యాంపస్‌లో అనుమతికి అజీం ప్రేమ్‌జీకి సీఎం లేఖ

బెంగళూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అవుటర్ రింగ్‌రోడ్డులోని ఇబ్బలూరు జంక్షన్ ప్రాంతంలో రద్దీ సమయంలో విప్రో క్యాంపస్ ద్వారా వాహనాలకు అవకాశం ఇవ్వాలని సీఎం సిద్దరామయ్య కోరారు. విప్రో వ్యవస్థాపకులు అజీం ప్రేమ్‌జీకి మంగళవారం ఆయన ప్రత్యేక లేఖ రాశారు. ఈ మార్గంలో అనుమతిస్తే స్థానికులకు అనుకూలం కానుందని లేఖలో ప్రస్తావించారు. క్యాంపస్‌లో భద్రతా చర్యలు పరిగణించి వాహనాలకు అవకాశం ఇవ్వాలని కోరారు. ట్రాఫిక్ రద్దీ ప్రాంతంలో కొంత ఉపశమనం కలుగుతుందని సీఎం లేఖలో వివరించారు.

ఖాళీ అవుతున్న క్యాంపస్..!



మైసూరులోని గంగూబాయి ఆర్ట్స్ యూనివర్సిటీ

● బోసిపోతున్న యూనివర్సిటీలు
● ఏడాదికేడాదికీ తగ్గుతున్న అడ్మిషన్లు
● సంప్రదాయ కోర్సులకు తగ్గిన డిమాండ్
● 2023-24లో నాలుగున్నర లక్షలమంది
● ఈ ఏడాది రెండున్నర లక్షలు దాటని వైనం

బెంగళూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒక రాష్ట్రం అభివృద్ధి చెందుతోంది అంటే అక్కడ ఉన్నత విద్యావిధానం ఆశాజనకంగా ఉందని నిర్ణయిస్తారు. దేశంలో కర్ణాటక రాష్ట్రానికి పలు ప్రత్యేకతలు ఉన్నాయి. ఐటీ కంపెనీలు, విమానరంగ సంస్థలు, బహుళజాతి సంస్థలు అధికంగా ఉన్నాయి. ఐటీ ఎగుమతులలో దేశానికే ముందడుగులో ఉంది. స్టార్టప్‌లు ఇలా చెప్పుకుంటూ పోతే సాంకేతికంగా ఎన్నో విభాగాలలో రాష్ట్రం దేశంలోనే ప్రగతి వైపు దూసుకెళ్తున్న ప్రాంతంగా చెబుతారు. ప్రభుత్వ యూనివర్సిటీలతోపాటు ప్రైవేట్ యూనివర్సిటీలకు కొదవలేదు. బెంగళూరు నుంచి బెళగావి దాకా, మైసూరు నుంచి మంగళూరుదాకా ఎటువెళ్లినా ప్రైవేట్ విద్యాసంస్థలు ఆశాజనకంగా ఉన్నాయి. అయితే ఇటీవల రాష్ట్రంలో ఉన్నత విద్య చదివేందుకు యూనివర్సిటీలలో అడ్మిషన్లు తగ్గడం ఆందోళనకరం అనిపిస్తోంది.

రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో విద్యార్థుల సంఖ్య ఏడాది వ్యవధిలో గణనీయంగా తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. యూనివర్సిటీలలో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ, పోస్ట్ గాడ్యుయేట్‌లతోపాటు పీహెచ్‌డీలకు అడ్మిషన్లు జరుగుతాయి. రెండేళ్ల వ్యవధితో పోలిస్తే దాదాపు సగంమంది విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టినట్టు ఉన్నత విద్యాశాఖ ద్వారా తెలుస్తోంది. రాష్ట్రంలో 32 యూనివర్సిటీలు ఉన్నాయి. ప్రస్తుతం 25.74 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 2.97 లక్షలమంది పీజీ, 22.68 లక్షల మంది యూజీ అడ్మిషన్లు పొందారు. 7,716 మంది పీహెచ్‌డీ విద్యార్థులు ఉన్నారు. 32 యూనివర్సిటీలు, 11 డీమ్డ్, 28 ప్రైవేట్ యూనివర్సిటీలు ఉన్నాయి. అత్యంత ఎక్కువమంది విద్యార్థులు అడ్మిషన్లు పొందిన యూనివర్సిటీల్లో రాణిచన్నమ్మ యూనివర్సిటీ ప్రథమస్థానంలో ఉంది. 2023-24లో 34,108 మంది విద్యార్థులు కాగా 2024-25లో 33,591 మంది ఉన్నారు. ఆ తర్వాత మైసూరులో 25,837, మంగళూరులో 16,816, బెంగళూరు సిటీ యూనివర్సిటీలో 16,789, బెంగళూరు యూనివర్సిటీలో 13,601మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. బెంగళూరు రెండు యూనివర్సిటీలో 2023-24లో 25వేలమంది అడ్మిషన్లు పొందారు. మండ్య యూనివర్సిటీ, కర్ణాటక సంస్కృత యూనివర్సిటీ, నృపతుంగ యూనివర్సిటీ, కర్ణాటక జానపద యూనివర్సిటీల్లో వెయ్యిలోపు విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. కన్నడ విశ్వవిద్యాలయం, బాగల్కోట యూనివర్సిటీ, డాక్టర్ గంగూబాయి హానగల్ సంగీత, కళల యూనివర్సిటీ, హాసన్ యూనివర్సిటీలలో వందలోపు అడ్మిషన్లు పరిమితమయ్యాయి. సంప్రదాయ కోర్సులకు డిమాండ్ తగ్గడమే దీనకి ప్రధాన కారణంగా తెలుస్తోంది.

అడ్మిషన్లు తగ్గేందుకు పలు కారణాలు

రాష్ట్రప్రభుత్వానికి అనుబంధమైన యూనివర్సిటీలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గేందుకు పలు కారణాలు ఉన్నాయి. కొన్ని యూనివర్సిటీలకు దశాబ్దాల చరిత్ర ఉన్నా సమగ్రమైన మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల కొరత వేధిస్తోంది. దీంతోపాటు ప్రస్తుతం ఉన్నత విద్య అంటే ఇంజనీరింగ్, లేదా మెడిసిన్‌కే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇతర కోర్సులలో విద్యార్థులు చేరుతున్నా భవిష్యత్తు అభద్రతా భావం అనే ఆలోచనలు వెంటాడుతున్నాయి. బీకామ్, బీఎస్సీ వంటి కోర్సుల్లో ప్రైవేట్ సంస్థల్లో చదివితే వారికి దక్కుతున్న ప్రాధాన్యం ప్రభుత్వ యూనివర్సిటీలలో అమలు కావడం లేదు. పైగా యూనివర్సిటీలలో క్యాలెండర్ ప్రక్రియ సమగ్రంగా అమలు కావడం లేదు. పరీక్షలు, మౌల్యమాపనానికి భారీ జాప్యం ఉంటోంది. మరోవైపు ఫలితాలు ప్రకటించడంలోనూ తీవ్రమైన జాప్యం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కోసారి ఆన్‌లైన్‌లో మినహా స్వయంగా యూనివర్సిటీలు సర్టిఫికెట్‌లు ఇచ్చేందుకు జాప్యం చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. పలు కారణాలతోనే బీకామ్, బీఎస్సీ, బీఏ, బీసీఏ, బీబీఏ వంటి కోర్సులకు అడ్మిషన్లు తగ్గుతున్నాయి.

బెళగావి కేంద్రంగా ఉండే విశ్వేశ్వరయ్య సాంకేతిక విశ్వవిద్యాలయం (వీటీయూ) ప్రైవేట్ యూనివర్సిటీలతో పోటీ పడుతోంది. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యత కల్గిన సబ్జెక్టులను కోర్ విధానంతో అమలు చేస్తున్నారు. ఇదే విధానం ఇతర ప్రభుత్వ యూనివర్సిటీలు అమలు చేస్తే ఎంతోకొంత విద్యార్థులకు అనుకూలం కానుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



మండ్య యూనివర్సిటీ

నిండిన ఉజ్జయిని

● మహారాష్ట్రలో వర్షాలతో నిండిన జలాశయం ● భీమా నదికి 2లక్షల క్యూసెక్కుల నీటి విడుదల



మణ్ణూర గ్రామంలో మునిగిన ఎల్లమ్మదేవి ఆలయం

బెంగళూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర పరిధిలో విస్తృతంగా కురుస్తున్న వర్షాలకు ఉజ్జయిని జలాశయం పూర్తిగా నిండింది. ఇన్‌ఫ్లో అధికంగా ఉండడంతో డ్యాం నుంచి 2 లక్షల క్యూసెక్కులను భీమ నదికి మంగళవారం విడుదల చేశారు. దీంతో నదీ పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలబురగి జిల్లా యంత్రాంగం సూచించింది. సొన్న బ్యారేజ్ నుంచి 1.50 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఈ ప్రభావంతో అఫ్జల్‌పుర తాలూకా దేవలగాణగాపుర, గత్తరగి బ్రిడ్జ్, మణ్ణూరలోని ఎల్లమ్మ దేవి ఆలయం పూర్తిగా నిండిపోయింది. భీమ నదికి వరద పోటెత్తడంతో నదీ పరీవాహక ప్రాంత గ్రామాలకు నీరు వచ్చే అవకాశం ఉందని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులు సూచిస్తున్నారు. అఫ్జల్‌పురతోపాటు వివిధ ప్రాంతాలలో అధికారులు అందుబాటులో ఉండాలని జిల్లా యంత్రాంగం ఆదేశించింది.



పెట్రోల్‌బంక్‌లో నిలిచిన నీటిని తొలగిస్తున్న దృశ్యం



ఉజ్జయిని డ్యాం నుంచి భీమా నదికి విడుదలవుతున్న నీరు



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నేతలు

యూజీసీ నిబంధనలు పాటించాలి

● కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి
● ఏఐఎస్ఎఫ్ డిమాండ్.. భారీ నిరసన

బెంగళూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో నిబంధనలు పాటించడం లేదని, అధ్యాపకుల కొరతపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఫ్రీడం పార్క్‌లో వారు నిరసన చేపట్టారు. 2025-26 సంవత్సరానికి అతిథి అధ్యాపకుల విషయంలో యూజీసీ అర్హులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అకడమిక్ ప్రారంభమై నెలలు గడిచినా కనీస సిలబస్ పూర్తి కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అతిథి అధ్యాపకుల విషయంలో కోర్టు నియమాలు పాటించాలని కోరారు. ప్లకార్డులు ప్రదర్శించి తమ నిరసన వ్యక్తం చేశారు. పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

రాచనగరి రంగులమయం

● మైసూరులో ఆకట్టుకున్న పూల ప్రదర్శన ● ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు



ప్యాలెస్ ఆవరణలో ఆకట్టుకుంటున్న ఫ్లవర్ షో

బెంగళూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మైసూరు దసరా ఉత్సవాలలో భాగంగా రాచనగరిలో రంగుల హరివిల్లులు ఆకట్టుకున్నాయి. అంబా విలాస్ ప్యాలెస్ ముందు భాగంలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. సాధారణంగా ముగ్గులంటే చుక్కలు వేసి వాటికి రంగులు అద్దుతారు. కానీ ప్యాలెస్ మైదానంలో చుక్కల ముగ్గులతోపాటు అంబారి మోసే అర్జున ఏనుగు బొమ్మతోపాటు ప్రభుత్వ గ్యారెంటీలు, మైసూరు రాజగోపురం, పులిపై దుర్గాదేవి, రాష్ట్రప్రభుత్వ చిహ్నమైన గండబేరుండవంటి తదితర నమూనాలు ఆకట్టుకున్నాయి. వ్యసనాలకు బానిస కావద్దంటూ నంజన్‌గూడు శ్వేత వేసిన ముగ్గు, గృహజ్యోతి ద్వారా ఎన్నో ఇళ్లలో దీపాలు వెలుగుతున్నాయనే బొమ్మ ముగ్గుతోపాటు పులిపై కూర్చున్న చాముండేశ్వరి రూపాన్ని

(మిగతా 7వ పేజీలో)



ఆకట్టుకుంటున్న రంగవల్లులు



ప్రదర్శనలో రాయల వారి విగ్రహ నమూనా

కంది కళకళ

ఏపుగా పెరిగిన పైరు

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం

సాగుకు మొగ్గు చూపుతున్న రైతులు



మరవకొమ్మ వద్ద కళకళలాడుతున్న కందిపంట

శింగనమల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంట ఆశాజనంగా ఉంది. సమయానికి వర్షాలు కురుస్తుండటం తో పైరు ఏపుగా పెరుగుతోంది. మండలంలో వర్షాధారం కింద ఈ ఏడాది సుమారు 3 వేల ఎకరాల్లో రైతులు కంది పంట సాగుచేశారు. గతంలో వేరుశనగ పంటలో కందిని అంతర పంటగా సాగు చేసేవారు. అయితే వేరుశనగలో నష్టాన్ని తట్టుకోలేక చాలా మంది రైతులు కందినే ప్రధాన పంటగా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్నారు. దిగుబడులు ఆశించిన స్థాయిలో ఉండటం, పంట నష్టం జరిగినప్పుడు వేరుశనగ కంటే కందికే ఎక్కువ ఇన్సూరెన్స్ వస్తుండటంతో గత నాలుగైదేళ్లుగా రైతులు ఈ పంట సాగుకే ఆసక్తి చూపుతున్నారు. కొంతమంది సొంత భూమిలోనే కాకుండా కౌలుకు తీసుకుని కూడా కంది పంట సాగు చేస్తున్నారు.

ఎప్పుడూ నష్టం రాలేదు: వడ్డే నెట్టికంటి, సి.బండమీదపల్లి



గత నాలుగు సంవత్సరాల నుంచి నాకు ఉన్న మూడు ఎకరాలలో కంది పంట సాగు చేస్తున్నా. మంచి దిగుబడులు వచ్చాయి. నా భూమితో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా. కంది పంట సాగు చేసినప్పటి నుంచి నాకు ఎప్పుడూ నష్టం రాలేదు. ఈ ఏడాది 30 ఎకరాల్లో కంది పంట సాగు చేశా. ప్రస్తుతం పంట పైరు ఆశాజనకంగా ఉంది. మార్కెట్‌లో గిట్టుబాటు ధర ఉంటే రైతుకు మరింత లాభదాయకంగా ఉంటుంది.

లక్షల్లో లాభాలు: కాయల జయరాముడు, సి.బండమీదపల్లి



నేను మూడేళ్లగా నా సొంత భూమితో పాటు కొర్రపాడు సమీపంలో మరో 35 ఎకరాలను కౌలుకు చేస్తున్నా. గత మూడు సంవత్సరాల నుంచి పెట్టుబడులు పోగా లాభాలు లక్షల్లో వచ్చాయి. ఈ సారి కూడా కంది పంటను సాగు చేశాం పంట బాగానే ఉంది. ఈపంటకు పెట్టుబడులు తక్కువ. పంట పూత, పిందె సమయంలో పురుగుమందులు పిచికారీ చేసి కాపాడుకుంటే చాలు మంచి దిగుబడులు వస్తాయి.

మంచి ధర ఉంది: అన్వేష్‌కుమార్, వ్యవసాయాధికారి



పంట మార్పిడిలో భాగంగా ఎక్కువ మంది రైతులు కంది పంటను సాగు చేశారు. ఈపంటకు పూత, పిందె దశలో మాత్రం తెగుళ్ల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో రైతులు వ్యవసాయాధికారుల సూచనలు సలహాలతో సస్యరక్షణ చర్యలు పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయి. గత నాలుగు సంవత్సరాల నుంచి మార్కెట్‌లో కందులకు మంచి గిట్టుబాటు ధర ఉంది.

మాతృమూర్తికి వందనం

• తల్లిపాలదాత లిఖితను సన్మానించిన తల్లులు



తల్లిపాల దాత దర్శి లిఖితను సన్మానిస్తున్న తల్లులు, మిల్క్‌బ్యాంక్ పర్యవేక్షకులు

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): తమ పిల్లలకు పాలు దానం చేసిన మీరే అసలైన మాతృమూర్తి అని దర్శి లిఖితను పలువురు తల్లులు సన్మానించారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని అనంత మదర్ మిల్క్ బ్యాంక్ కేంద్రంలో లిఖితకు మంగళవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్ మిల్క్ బ్యాంక్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ హేమలత మాట్లాడుతూ నగరానికి చెందిన దర్శి లిఖిత బెంగళూరు ఎయిర్‌పోర్టులో ఎలక్ట్రికల్ మేనేజర్‌గా పని చేస్తున్నారన్నారు. ఏప్రిల్ 30న బిడ్డకు జన్మనిచ్చిన ఆమె ఇప్పటి వరకు 45 నుంచి 50లీటర్ల తల్లి పాలను దానం చేశారన్నారు. లిఖితకు ప్రసూతి సెలవులు ముగియడంతో తిరిగి ఆమె విధుల్లోకి వెళ్తున్న సందర్భంగా సన్మాన సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షబానా అనే విద్యార్థి తన పాకెట్ మనీతో ఫీడింగ్ బాటిల్స్‌ను దానం చేసిందని ప్రశంసించారు. కార్యక్రమంలో మిల్క్‌బ్యాంక్ నోడల్ ఆఫీసర్ భాస్కర్ నాయక్, న్యూట్రిషనిస్ట్ పల్లవి, కౌన్సిలర్ రాధ, స్టాఫ్‌నర్స్ రమ, కృష్ణ శిశువుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ పీడితులకు వైద్యం చేయాలి

• కలెక్టర్ ఆనంద్



అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీతో జీవిస్తున్న వారందరికీ వైద్యం అందించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో హెచ్ఐవీతో జీవిస్తున్న వారిని గుర్తించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. గుర్తించిన వారందరినీ ఏఆర్‌టీ కేంద్రాల్లో నమోదయ్యేలా చూసి, చికిత్స అందించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఈబీదేవి, జడ్పీ సీఈఓ శివశంకర్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ క్షయ నియంత్రణ అధికారి జయలక్ష్మి, డీపీఓ నాగరాజునాయుడు, ఇన్‌చార్జ్ డీసీహెచ్ఎస్ ఎల్లప్ప పాల్గొన్నారు.

కోనవిందు..!

దగ్గరలో పర్యాటక క్షేత్రం

ఆకట్టుకుంటున్న ప్రకృతి అందాలు



కనువిందు చేస్తున్న కోన జలపాతం

దసరా సెలవులు వచ్చాయి. ఎక్కువ దూరం వెళ్లకుండా.. ఉమ్మడి జిల్లా పరిధిలోనే ఆహ్లాదరక వాతావరణంలో ఒక్క రోజు గడిపేందుకు చాలా ప్రాంతాలు ఉన్నాయి. అలాంటి వాటిలో ఒకటి.. యాడికి మండలంలోని కోన రామలింగేశ్వర స్వామి క్షేత్రం. వర్షాకాలంలో జీవం పోసుకునే జలపాతం ఇక్కడి విశేషం. ఇప్పుడు జలజలా దూకి.. గలగల పారుతోంది. కోన చెరువు, కోనేరు, ఎకరం విస్తీర్ణంలో ఉన్న మర్రిచెట్టు.. దానికి వేలాడే ఊడలు, చుట్టూ పచ్చదనం.. అన్నీ కనువిందు చేస్తాయి. పెద్దగా వెలుగులోకి రాని కోన గుహలు కూడా ఈ ప్రాంతంలో చూడదగ్గ ప్రదేశం. దగ్గరికి వెళ్లేదాకా అక్కడ ఓ గుహ ఉన్నట్లే తెలియదు. కాస్త ధైర్యం చేసి లోపలికి వెళ్లితే.. కొంత దూరం వరకూ సెల్‌ఫోన్ టార్చ్ వెలుగులలో అందాలను, ఆ లోపల చిన్నపాటి సెలయేటినీ చూడొచ్చు. క్షేత్రంలో కోన రామలింగేశ్వరుడిని దర్శించుకుని, ఉదయం నుంచి సాయంత్రం వరకూ హాయిగా గడపొచ్చు. యాడికి పట్టణం నుంచి 15 కి.మీ. దూరంలో ఉంటుంది ఈ ప్రాంతం. కానీ వాహన సౌకర్యం లేదు. యాడికి వరకూ బస్సులో వెళ్లొచ్చు. అక్కడి నుంచి సొంత వాహనం, లేదా అద్దె వాహనం ఏర్పాటు చేసుకోవాల్సిందే. వెంట తినడానికి ఏదో ఒకటి తీసుకెళ్లడం మరిచిపోవద్దు. ఆ నీటిలో ఆడుకుని, ప్రకృతి అందాలను తిలకిస్తూ.. పరవశించి పోయాక.. ఆకలి వేస్తుంది. అక్కడ ఏమీ దొరకదు. దగ్గరలో కోన ఉప్పలపాడు గ్రామం ఉంది. కానీ పల్లెటూరు. చిన్న చిన్న దుకాణాలు మాత్రమే ఉంటాయి. ఇంటిల్లిపాదీ వెళితే.. అక్కడే వంట చేసుకుని తినేందుకూ వీలుంది.


-ఆంధ్రజ్యోతి, యాడికి



కోన రామలింగేశ్వర స్వామి



కోన గుహల ప్రవేశ ద్వారం



కోన రామలింగేశ్వరస్వామి ఆలయం ముంగిట కొండల పైనుంచి వస్తున్న నీరు



అబ్బురపరిచే ఊడల మర్రి



ఆహ్లాదపరిచే కోన చెరువు



ఆలయం వద్ద కోనేటిలోకి పారుతున్న జలపాతం నీరు

ఆర్డీటీకి భయం లేదు

• సీఎం మాటగా చెబుతున్నాం • ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేల భరోసా • మంత్రి లోకేశ్‌తో భేటీ.. ఆర్డీటీపై చర్చ



నారా లోకేశ్‌తో మంత్రి సవిత, ఎమ్మెల్యేలు

అనంతపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సేవలకు ఎటువంటి ఆటంకం ఉండబోదని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాటగా తాము చెబుతున్నామని ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు మంగళవారం స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఆయన కార్యాలయంలో మంత్రి సవిత, విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, సురేంద్రబాబు, గుమ్మనూరు జయరాం, దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూరారెడ్డి కలిశారు. ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ అంశంపై మంత్రి నారా లోకేశ్‌తో చర్చించారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ విషయంలో జిల్లా ప్రజలు ఆందోళన చెందుతున్నారని, చాలామంది రోడ్లెక్కి నిరసనలు తెలుపుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు నారా లోకేశ్ స్పందిస్తూ ఆర్డీటీని కాపాడటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిపై కేంద్రంతో నిరంతర సంప్రదింపులు జరుగుతున్నాయన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు దీనిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారమవుతుందని హామీ ఇచ్చారు. లోకేశ్‌ను కలిసిన అనంతరం మంత్రి సవిత, కాలవ శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ ఆర్డీటీ సమస్య పరిష్కారానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ జిల్లాకు ఆర్డీటీ అందిస్తున్న సేవలు అమూల్యమైనవన్నారు. అందుకే ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందన్నారు. ఎమ్మెల్యే దగ్గుబాటి మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థని అడ్డుపెట్టుకొని వైసీపీ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మాట్లాడుతూ సేవ్ అనంతపురం, సేవ్ ఆర్డీటీ నినాదంతో జిల్లా ఎమ్మెల్యేలంతా ఏకతాటిపై ఉన్నామన్నారు. ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయించే బాధ్యత తమపై ఉందన్నారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ దశాబ్దాలుగా విద్య, వైద్యాన్ని పేదలకు అందిస్తున్న ఆర్డీటీని ప్రజాప్రతినిధులమంతా ఐక్యమత్యంతో కాపాడుకుంటామన్నారు. వైసీపీ నేతలు రాజకీయ ఉనికి కోసమే ఆర్డీటీ అంశాన్ని వాడుకుంటున్నారని విమర్శించారు. మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ గత 56 సంవత్సరాలుగా ఆర్డీటీ అనేక సేవ కార్యక్రమాలు చేస్తోందన్నారు. పేదలకు గృహ నిర్మాణం, విద్య, వైద్యం ఉచితంగా అందిస్తోందన్నారు. రైతులకు పండ్ల మొక్కలు అందజేస్తూ హార్టికల్చర్ అభివృద్ధికి పాటుపడుతోందని వెల్లడించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4వేల గ్రామాల్లో ఎంతో మందికి ఆర్డీటీ సేవలు అందిస్తోందన్నారు. అలాగే 30 సంవత్సరాల పోరాటం అనంతరం చంద్రబాబు చేతుల మీదుగా ఎస్సీ వర్గీకరణ జరగడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నారన్నారు.

పాపం వైసీపీదే: కాలవ

అనంతపురం క్రైం/రాయదుర్గం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు ఉచితంగా అందాల్సిన వైద్యవిద్యను ఖరీదైనదిగా మార్చిన పాపం గత వైసీపీ ప్రభుత్వానిదేనని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. అసెంబ్లీలో మంగళవారం ఆయన వైద్యరంగంపై మాట్లాడారు. పేదలకు అందాల్సిన సీట్లను ఎన్నారై, ఇతర కోటా పేరుతో రూ.20 లక్షలు, రూ.12 లక్షలకు పెంచినది నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీలు ప్రారంభించినట్లు గొప్పలు చెబుతున్నారని, అయితే నేటికీ పునాది, మొండి గోడలకే పరిమితమైన వాటిని చూసి వైసీపీ నాయకులు సిగ్గుపడాలన్నారు. వివిధ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలల ఫొటోలు అసెంబ్లీలో చూపుతూ వైసీపీ తీరును ఎండగట్టారు. ఐదేళ్లలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి, అన్ని రంగాల్లో విధ్వంసం సృష్టించారంటూ ఫైర్ అయ్యారు. ఉమ్మడి ఏపీలో సీఎం చంద్రబాబు 17 మెడికల్ కాలేజీలు ప్రారంభిస్తే... అందులో ఆరు ప్రభుత్వ రంగంలోనే ఉన్నాయన్నారు. అత్యంత వెనుకబడిన అనంతపురంలో సైతం 2000 సంవత్సరంలో వైద్యకళాశాలను ప్రారంభించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కానీ వైసీపీ ప్రభుత్వం ఏ ఒక్కటీ ప్రారంభించలేదని మండిపడ్డారు. అలాగే రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రిలో 22మంది వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం ఆరుగురే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో వంద పడకల ఆసుపత్రిగా దీనిని మార్చారని తెలిపారు. అందుకు అనుగుణంగా అదనపు భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించారన్నారు. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు.

నేడే అమరావతికి.. కొత్త టీచర్ల పయనం

ఉదయం పీవీకేకే కళాశాల నుంచి బయల్దేరనున్న బస్సులు

ఏర్పాట్లు పూర్తిచేసిన విద్యాశాఖాధికారులు



ఏర్పాట్లపై కసరత్తు చేస్తున్న విద్యాశాఖ అధికారులు

అనంతపురం విద్య, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో టీచర్ పోస్టులు సాధించిన వారు బుధవారం అమరావతికి వెళ్లనున్నారు. మెగా డీఎస్సీ సభలో పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోనున్నారు. ఈనెల 19వ తేదీనే వెళ్లాలని ఏర్పాట్లు చేయగా.. వర్షాల కారణంగా వాయిదా పడింది. ఈనెల 25న అమరావతిలో మెగా డీఎస్సీ సభ నిర్వహణకు ముహూర్తం ఖరారు చేశారు. టీచర్ ఉద్యోగాలు సాధించిన వారందరినీ తీసుకురావాలని రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు పంపారు. ఆ మేరకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేపట్టింది. డీఎస్సీలో ఎంపికైన టీచర్లు, పీజీటీ, టీజీటీలతోపాటు ఒక్కో అభ్యర్థి వెంట మరొకరు తప్పనిసరిగా ఉండాలని నిబంధన విధించారు. పర్యవేక్షణకు ప్రతి బస్సులో ముగ్గురిని ఏర్పాటు చేశారు. ఈలెక్కన మొత్తం 2,100 మంది జిల్లా నుంచి అమరావతికి వెళ్తారని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. వీరికోసం 45 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. బుధవారం ఉదయం 7గంటలకు అనంతపురంలోని ఆలమూరు రోడ్డులోగల పీవీకేకే కళాశాల నుంచి బస్సులు బయల్దేరుతాయన్నారు. అభ్యర్థులు 6 గంటలకే కళాశాలకు చేరుకోవాలని డీఈఓ ప్రసాద్ బాబు కోరారు.

గుడి డబ్బు కోసం గొడవ

• గ్రామసభ వాయిదా



సభలో మాట్లాడుతున్న ఆర్డీఓ కేశవనాయుడు

శింగనమల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుడి డబ్బు కోసం ఊరి జనం గొడవ పడ్డారు. మండలంలోని పెరవలి గ్రామానికి చెందిన వీరబ్రహ్మం స్వామి దేవాలయం నాయనపల్లి క్రాస్‌లో ఉండేది. ఎన్ఎస్ 544 విస్తరణలో గుడి పోయింది. అందుకు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లిస్తుంది. పెరవలి గ్రామానికి చెందిన వారు మెదట ఒక ఆలయ కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. విబేదాలు రావడంతో మరో కమిటీ వేసుకున్నారు. గుడికి సంబంధించిన పరిహారం సొమ్ము రూ.60లక్షలుపైగా ఒక కమిటీ పేరున జమ చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మరో కమిటీ సభ్యులు.. కలెక్టర్, ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేయడంతో గుడి డబ్బు విషయంలో మరోసారి గ్రామంలో సభ నిర్వహించాలని సూచించారు. ఆ మేరకు ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ శేషారెడ్డి, సీఐ కౌలుట్లయ్య కలిసి పెరవలి సచివాలయంలో మంగళవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. రెండు కమిటీల సభ్యులు వాగ్వాదం చేసుకున్నారు. దీంతో అధికారులు గ్రామసభను వాయిదా వేశారు. ఇరు కమిటీలు ఏకాభిప్రాయానికి వస్తేనే ప్రభుత్వం సొమ్ము జమ చేస్తుందనీ, లేదంటే రాదని ఆర్డీఓ కేశవనాయుడు స్పష్టం చేశారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

డాక్టర్ ఎడ్వర్డ్ బచ్ (జయంతి)




బ్రిటీష్ డాక్టర్ ఎడ్వర్డ్ బచ్ 1886 సెప్టెంబరు 24న బర్మింగ్ హామ్‌లోని మోస్లే ప్రాంతంలో జన్మించారు. బ్యాక్టీ రియాలజిస్ట్‌గా, హోమి యోపతిస్ట్‌గా, ఆధ్యాత్మిక రచయితగా రాణించారు. ఆయన రూపొందించిన 'బచ్ ఫ్లవర్ రెమెడీస్' వైద్యవిధానం కాస్త భిన్నంగా ఉండి ఆకట్టుకుంది. రోగాల నివారణకు సరికొత్త విధానం అవలంబించారు. 50వ యేట 1936 నవంబరు 27న కన్నుమూశారు.

రుహోల్లా ఖొమైనీ (జయంతి)




ఇరాన్ దేశానికి చెందిన రాజకీయ నాయకుడు, పండితుడు రుహోల్లా ఖొమైనీ 1902 సెప్టెంబరు 24న జన్మించారు. 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్' సంస్థాపకులు, ఉద్య మనేత. విప్లవం తర్వాత దేశానికి అధినేత అయ్యాడు. ఈ పదవి ఆజన్మాంతము దేశంలో అత్యున్నత, మత రాజకీయ నాయకుడిగా కొనసాగే అవకాశం కల్పించబడింది. హజ్జతుల్ ఇస్లాం లేదా హజ్జతుల్లా అని సంబోధి స్తారు. ఫిలాసఫీ, కవిత్వం, సాహిత్యం, రాజకీయాలు - ప్రభుత్వంపై పుస్తకాలు రాశారు. 1989 జూన్ 3న కన్నుమూశారు. అంత్యక్రియలలో 30లక్షల మందికి పైగా పాల్గొన్నారు.

స్వామి చిదానంద (జయంతి)



ప్రముఖ ఆధ్యాత్మికవేత్త స్వామి చిదానంద 1916 సెప్టెంబరు 24న మంగళూరులో జన్మించారు. ఆయన అసలు పేరు శ్రీధర్‌రావు. సన్యాసం స్వీకరించాక 'చిదానంద'గా నామకరణం చేశారు. రిషికేశ్‌లోని 'డివైన్ లైఫ్ ఆఫ్ సొసైటీ'కి అధ్యక్షుడిగా వ్యవహరించారు. దేశ విదేశాలలో ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. యోగాపై దేశ వ్యాప్తంగా అవగాహన కల్పించి ఒక మ్యూజియం కూడా ఏర్పాటు చేశారు. 2008 ఆగస్టు 28న పరమ పదించారు. 2016లో ఆయన శతజయంతి స్మారక పోస్టల్‌స్టాంపు విడుదల చేశారు.

ధూళిపాళ సీతారామశాస్త్రి (జయంతి)



తెలుగు నాటక, సినీరంగంలో పేరొందిన ధూళిపాళ సీతారామ శాస్త్రి 1922 సెప్టెంబరు 24న గుంటూరు జిల్లా పల్నాడు మండలం దాచేపల్లిలో జన్మించారు. పౌరాణిక పాత్రలలో ప్రత్యేకించి 'శకుని' పాత్ర ఆయన జీవితంలో మైలురాయి అని చెప్పాలి. గయుడు, రావణుడు, మైరావణుడు వంటి పౌరాణిక పాత్రల్లో మెప్పించారు. 13వ ఏటనే నటనా రంగంలోకి ప్రవేశించి రంగస్థలంపై దుర్యోధన, కీచకుడు తదితర పాత్రల్లో రాణించారు. 300కుపైగా సినిమాలలో సాత్విక, దుష్ట పాత్రల్లో నటించి ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. జీవిత చరమాంకంలో శ్రీరామసేవకే అంకితమయ్యారు. ధూళిపాళ ట్రస్టు ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి, ధూళిపాళ కళావాహిని ద్వారా కళారంగాన్ని ప్రోత్సహించారు. 2001లో కంచి కామకోటి పీఠాధిపతి నేతృత్వంలో సన్యాసం స్వీకరించి మారుతి సేవేంద్ర సరస్వతిగా మారారు. 2007 ఏప్రిల్ 13న కన్నుమూశారు.

ఎలియనర్ కాటన్ (పుట్టినరోజు)



నవలా రచయిత్రి, స్క్రీన్‌రైటర్ ఎలియనర్ కాటన్ 1985 సెప్టెంబరు 24న ఉత్తర అమెరికా కెనడా దేశంలో జన్మించారు. అతి పిన్న వయస్సులోనే 'ది ల్యుమినరీస్' నవలకు 'బుకర్ ప్రైజ్' అందుకున్నారు. కెనడియన్ గవర్నర్ జనరల్స్ లిటరరీ అవార్డ్, సాహిత్యంలో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఆమె తొలి నవల 'రిహార్సల్' సినిమాగా తెరపైకెక్కి 2016 టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో ప్రదర్శించబడింది. న్యూజిలాండ్ పోస్ట్‌బుక్ అవార్డ్, ఇతర గౌరవాలు అందుకున్నారు. 2023లో బెస్ట్ ఆఫ్ యంగ్ బ్రిటీష్ నావలిస్ట్‌గా 'గ్రాంటా'లో చోటు పొందారు.

పరిశోధనలు రైతులకు మేలు చేయాలి

● ఉప కులపతి డాక్టర్ హనుమంతప్ప




సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న ఎంజీ పాటిల్

రాయచూరు సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సాగు రంగంలో వస్తున్న మార్పులకనుగుణంగా నేటి తరం విద్యార్థులు తమ పరిశోధనలో మరింత గుణాత్మకతను పాటించాలని వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉప కులపతి డాక్టర్ హనుమంతప్ప సూచించారు. పరిశోధనలు నిబద్ధతతో తులనాత్మక అధ్యాయనంతో గుణాత్మకత ఉన్నప్పుడే రైతులకు సమాజానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నగరంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయం వద్ద మంగళవారం జాతీయ పరిశోధన సమ్మేళనం నిర్వహించారు. సమ్మేళనాన్ని ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంజీ పాటీల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఉప కులపతి డాక్టర్ హనుమంతప్ప, పరిశోధనలు రైతు ప్రయోజనాలకు తొలి పీఠగా వేదికగా ఉండాలన్నారు. వ్యవసాయ ప్రధానమైన దేశంలో వ్యవసాయం పైనే కోట్లాది మంది ప్రజలు ఆధారపడి జీవిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు సహితం సాగు రంగానికి పెద్ద పీఠ వేస్తున్నాయన్నారు. కాగా విశ్వ విద్యాలయంలో పరిశోధనలకు సంబంధించి అనేక సౌకర్యాలను అందుబాటులో ఉంచామని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాచనగరి రంగులమయం



గాంధీ మండప నమూనా



దండి సత్యాగ్రహం నమూనా



అమ్మవారి ముగ్గు వేస్తున్న మహిళ

(5వ పేజీ తరువాయి) తుమకూరు నిర్మల వేశారు. మహిళగా గర్వపడతామనే రూపకంలో దావణగెరె లక్ష్మి ముగ్గు వేయగా, విజయనగరకు చెందిన సునిత నంది, శివలింగం బొమ్మను వేశారు. దసరా ఏనుగు, రథం, నెమలి వంటి చిత్రాలు ప్రత్యేక ఆకర్షణ అనిపించేలా ఏర్పాట్లు చేశారు.

ఆకట్టుకున్న కేక్ షో

ఇక జయచామరాజ అరసు ఎడ్యుకేషన్ ట్రస్టు ఆవరణలో కేక్ షో ఏర్పాటు చేశారు. 1500 కేజీలతో మైసూరు ప్యాలెస్, నాల్వడి కృష్ణరాజ ఒడయార్, కేఆర్‌ఎస్ డ్యాం, ఏనుగులను రూపొందించారు. మైసూరు ప్యాలెస్ కేక్‌ను 40మంది, 20కుపైగా రూపాలను తీర్చారు. ఇందుకు రూ.70లక్షలు దాకా ఖ ర్చు అయినట్టు తెలిపారు.

పూల సోయగం

దసరా ఉత్సవాలలో భాగంగా కర్జన్ ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన పూల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణ అవుతోంది. ఆపరేషన్ సిందూర పేరిట ఏర్పాటైన పూల సోయగం సందర్శకులను ఆకట్టుకుంటోంది. ప్రత్యర్థిదేశానికి సవాల్ చేసిన కల్నల్ సోఫియా, వ్యోమికా సింగ్‌లను పూలతో అభినందించారు. ఉద్యానవనశాఖ మైసూరు కుప్పణ్ణ ఉద్యానవనంలో గ్యారెంటీ పథకాలు, ఉప్పు సత్యాగ్రహం, అంబారిని మోసే అర్జున రూపాలు ఆకట్టుకుంటున్నాయి.

వింటేజ్ కార్లు సందడి

అలనాటి ప్రాచీనకార్లు మైసూరు నగర వీధులలో చక్కర్లు కొట్టాయి. దసరా ఉత్సవాలలో భాగంగా వింటేజ్ కార్ల ప్రదర్శన ఏర్పాటు చేశారు. సుమారు 50కుపైగా కార్లు ప్రదర్శనలో ఉంచారు. దశాబ్దాలక్రితం కార్లు విచిత్రం అనిపించాయి. అయోధ్య రామాలయంలో బాల రాముడి విగ్రహ రూపకర్త అరుణ్ యోగిరాజ్ వింటేజ్ కార్ల ప్రదర్శనను ప్రారంభించారు. ఈనెల 26 వరకు ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు ప్రకటించారు.



వింటేజ్ కార్ల ప్రదర్శనను ప్రారంభిస్తున్న శిల్పి అరుణ్ యోగిరాజ్

వచనాలతో నైతిక విలువలు

» శరణ సాహిత్య సమ్మేళనంలో బసవరమానంద స్వామీజీ



ఊరేగింపులో బసవరమానంద స్వామీజీ తదితరులు

విజయపుర, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వచనాలు నైతిక విలువలను బోధించే మాధ్యమమని, సమాజంలో కులమత తారతమ్యాలను శతాబ్దాల క్రితమే శరణరు తిరస్కరించారని వనకల్లు క్షేత్రం బసవరమానందస్వామిజీ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని గాంధీచౌక్‌లో అఖిల కర్ణాటక మిత్రసంఘం ఆధ్వర్యంలో జిల్లా కదళివేదిక, జిల్లా శరణసాహిత్య పరిషత్, రాష్ట్రీయ బసవదళ, అక్కనబళగ సహకారంతో జిల్లా శరణసాహిత్య సమ్మేళనాన్ని మంగళవారం నిర్వహించారు. ఇదే సందర్భంగా గ్రామీణ జిల్లా ఉత్సవం, జిల్లా సహకారి సమ్మేళనం, డాక్టర్ విష్ణువర్ధన్ జయంతి ఉత్సవం చేపట్టారు. కార్యక్రమాలకు శరణ సమ్మేళన అధ్యక్షులుగా స్వామిజీ పాల్గొని ప్రసంగించారు. వచన సాహిత్యం సమానత, శ్రమ, కాయక, దాసోహ పరంగా ఎంతో ప్రముఖమైనదన్నారు. ధార్మిక, సామాజిక, దార్శనిక చింతనలతో కూడి ఉందన్నారు. వచనాలతో సత్యం, చిత్తశుద్ధి ద్వారా సమాజంలో పరివర్తనకు సహకరిస్తుందన్నారు. అఖిల కర్ణాటక మిత్రసంఘం అధ్యక్షుడు చి.మా.సుధాకర్ మాట్లాడుతూ అవిభాజ్య బెంగళూరు జిల్లా సాహిత్యం, సంస్కృతి, శరణ సాహిత్యానికి తనదైన గుర్తింపు ఉందన్నారు. సామాజిక అభివృద్ధిలో ఎంతో మంది పూర్వీకులు శ్రమించారన్నారు. జిల్లా సహకారి సమ్మేళనాధ్యక్షుడు వెంకటాపుర లక్ష్మణ్, కదళి వేదిక జిల్లా అధ్యక్షురాలు స్వర్ణగౌరి తదితరులు ప్రసంగించారు. వివిధ రంగాలలో గణనీయ సేవలందించిన ప్రముఖులను సత్కరించారు.



గిరినగర్ వాసవీమాత



హనుమంతనగర్‌లో...



పూల ప్రదర్శనలో అంబారి

పౌరకార్మికుల సేవలు అపారం

» పౌర కార్మిక దినోత్సవంలో ఎమ్మెల్యే రవికుమార్



వేదికపై ఎమ్మెల్యే రవికుమార్ తదితరులు



పౌరకార్మికులకు సన్మానం

శిడ్లఘట్ట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పల్లె నుంచి నగరం దాకా స్వచ్ఛంగా ఉంచడంలో పౌరకార్మికుల సేవలు అపారమని ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ అభిప్రాయపడ్డారు. నగరసభ ఆధ్వర్యంలో 2025 వార్షిక పౌరకార్మిక దినోత్సవాన్ని అంజనాద్రి పార్టీహాల్‌లో ఘనంగా నిర్వహించారు. నగరసభ అధ్యక్షుడు ఎంవీ వెంకటస్వామి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ తాను బాధ్యతలు స్వీకరించి 28 నెలలు గడిచాయని, ఈ అవధిలో ప్రజల ఆశీస్సులతో ఉత్తమ పాలన అందించడం తన లక్ష్యమన్నారు. పట్టణ పరిధిలో 12,800 ఇళ్లకు శుద్ధతాగునీరు అందించేందుకు అమృత్-2 పథకం కింద రూ.92కోట్లు మంజూరయ్యాయన్నారు. వచ్చే 40 ఏళ్ల అవసరాలను లక్ష్యంగా రూ.38కోట్లతో యూజీడీ పథకానికి టెండర్లు జరిగాయన్నారు. భూగర్భ డ్రైనేజీ త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. నగరసభలోని 150మందికిపైగా పౌరకార్మికులు, అధికారుల సేవలను కొనియాడారు. అందరి సహకారంతోనే ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం సాధ్యమన్నారు. పౌరకార్మికుల పిల్లలకు విద్య, సౌలభ్యాలు, ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా తనవంతు సహకారం అందిస్తానన్నారు. పౌరకార్మికులైన మహిళలకు చీర, కుక్కర్, పురుషులకు ప్యాంటు షర్టు, కుక్కర్ అందచేసి సత్కరించారు. సమావేశంలో నగరసభ కమిషనర్ అమృత, నగరసభ సభ్యులు, పికార్డ్ బ్యాంకు అధ్యక్షుడు బంకు మునియప్ప, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు ప్రాధాన్యం: ఈఓ



స్వచ్ఛతా అభియాన్‌లో పంచాయతీ ఈఓ రవికుమార్ తదితరులు

బంగారపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పల్లె అయినా పట్టణం అయినా స్వచ్ఛత పాటించాలని అందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని తాలూకా పంచాయతీ కార్యనిర్వహణాధికారి రవికుమార్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని చిక్క అంకండహళ్ళి గ్రామపంచాయతీలో స్వచ్ఛతా సేవా అభియానను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఇళ్లు, చుట్టుపక్కల ప్రాంతాలను స్వచ్ఛంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అన్నారు. బహిర్భూమి రహిత గ్రామానికి అందరూ సహకరించాలన్నారు. అన్ని గ్రామ పంచాయతీలు, పాఠశాలలు, గ్రామాలలో స్వచ్ఛతా అభియాన నిర్వహిస్తున్నామని, స్వచ్ఛతకు ప్రజలు తమవంతు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ అధ్యక్షురాలు గిరిజమ్మ శ్రీనివాస్, అక్షర దాసోహ యువరాజ్, పీడీఓ దేవరాజ్, జేఈ మంజు తదితరులు పాల్గొన్నారు.

పౌరకార్మికులు ఉపకరణాలు వాడాలి



వేదికపై నగరసభ కమిషనర్ తదితరులు

దొడ్డబళ్ళాపుర, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పౌరకార్మికులు సురక్షత కోసం నగరసభ సమకూర్చే ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని నగరసభ కమిషనర్ కార్తీకేశ్వర్ అభిప్రాయపడ్డారు. నగరసభ ఆధ్వర్యంలో మంగళవారం ఏబీఎం హాల్‌లో ఏర్పాటైన పౌరకార్మికుల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. నగరసభ ప్రధాన కర్తవ్యం పట్టణ స్వచ్ఛతను కాపాడడమే అన్నారు. ప్రతి ఒక్కరూ బూట్‌లు, గ్లోవ్స్ వినియోగించి స్వచ్ఛతా పనులలో పాల్గొనాలన్నారు. పౌరకార్మికులు తమ ఆరోగ్యం పట్ల కూడా దృష్టి సారించాలన్నారు. నగరసభ ఉపాధ్యక్షుడు మల్లేశ్ మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాల వేళ 34మంది పౌర కార్మికుల కల సాకారమైందని గృహభాగ్య పథకం కింద ఇల్లు దక్కడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు ఏఈఈ రామేగౌడ, రమేశ్‌ల శ్రమ అపారమన్నారు. కార్యక్రమంలో నగరసభ అధ్యక్షురాలు సుమిత్రా ఆనంద్, ఉపాధ్యక్షులు మల్లేశ్, స్థాయి సమితి అధ్యక్షుడు వడ్డరహళ్ళి రవి, నగరసభ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభ నగర్‌లో కెనరా బ్యాంకుచే స్వచ్ఛతా అభియాన్



పౌరకార్మికులకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బెంగళూరు, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థికమంత్రిత్వ కార్యాలయం పిలుపు మేరకు కెనరాబ్యాంకు ప్రధాన కార్యాలయం కలిగిన నగరంలోని 182వ వార్డు పద్మనాభనగర్‌లో మెగా స్వచ్ఛతా హీ సేవ 2025 కార్యక్రమం నిర్వహించారు. జనరల్ మేనేజర్ రామనాయక్‌తోపాటు కెనరాబ్యాంకు ఉద్యోగులు భాగస్వామ్యులయ్యారు. వందమందికిపైగా బ్యాంకు సిబ్బంది, స్థానికులు, పౌరకార్మికులతో కలసి మూడు ప్రాంతాలలో స్వచ్ఛతా పనులు జరిపారు. పౌరకార్మికులకు ప్రత్యేక సురక్షితా కిట్‌లను అందించారు. వారికి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

కులగణనలో సవితాగా నమోదు చేయండి



మాట్లాడుతున్న శ్రీధరానంద స్వామీజీ

బెంగళూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బీసీ కమిషన్ ద్వారా జరుగుతున్న కులగణన సర్వేలో కులం పేరును సవితాగా నమోదు చేయాలని సవితా సమాజగురువు శ్రీధరానంద స్వామిజీ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో కర్ణాటక రాష్ట్ర సవితా సమాజ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రాజణ్ణతో కలసి మీడియాతో మాట్లాడారు. కులగణన సర్వేలో స్పష్టంగా నమోదు చేయించాలని సూచించారు. కాలం 8లో హిందూ మతంగాను, కాలం 9లో సవితా కులంగా నమోదు చేయించాలన్నారు. ఉపకులాల కాలం 10లో నయనజ క్షత్రియ, బండారి, భజంత్రి, నావి, హడపద, క్షౌరి, నాపిత, మహలె, మేలెగార వంటి పేర్లను నమోదు చేయించుకోవచ్చునన్నారు. రాష్ట్రంలో కులానికి చెందినవారు ఎంత జనాభా ఉన్నారనేది కులగణన నివేదికలోనే స్పష్టం కానుందన్నారు. సవితా కులానికి చెందినవారు ఇతరత్రా పేర్లను నమోదు చేయించరాదని, తద్వారా భవిష్యత్తులో బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం నుంచి అందే సౌలభ్యాలు, రిజర్వేషన్లకు ఆటంకం కానుందని రాజణ్ణ తెలిపారు. మీడియా సమావేశంలో ఉద్యోగుల సంఘం పదాధికారులు, కులపెద్దలు పాల్గొన్నారు.

సహకార సంఘం వార్షిక సమావేశం



స్థానిక ప్రముఖులకు సంఘం ఆధ్వర్యంలో సత్కారం

దొమ్మసంద్ర, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా తలగరహళ్ళి గ్రామంలో పాల ఉత్పత్తిదారుల సహకారసంఘం 2024-25 వార్షిక సర్వసభ్యుల వార్షిక సమావేశం జరిగింది. సంఘం అధ్యక్షుడు టీ కరియప్ప అధ్యక్షత వహించారు. వార్షిక జమా ఖర్చును సంఘం కార్యదర్శి శ్రీనివాస్ వివరించారు. గ్రామంలో ఎవరు మృతి చెందినా కులంతో సంబంధం లేకుండా అంత్యక్రియలు నిర్వహించేవారిని సంఘం పాలకమండలి సత్కరించింది. సంఘంలో విక్రయించే పశుదాణాకు రాయితీ ఇవ్వాలన్న సభ్యుల ప్రశ్నపై శ్రీనివాస్ స్పందిస్తూ ప్రస్తుతం లాభం లేకుండా విక్రయిస్తున్నామని, రాయితీ అంశం తదుపరి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. పంచాయతీ లేదా తాలూకాస్థాయిలో అధికారులు ఎవరు మంచి సేవలు అందించినా గుర్తించి గౌరవించడం ద్వారా ప్రతి గ్రామంలోనూ సమాజ సేవకులు పెరుగుతారని అభిప్రాయపడ్డారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు గిరీశ్, సభ్యులు ఎన్ చంద్రప్ప, శివశంకర్, మంజునాథ్, మహదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

కులగణనలో మాలగా నమోదు చేయండి

బెంగళూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కులగణనలో హిందూ మతం కులం కాలంలో మాలగా నమోదు చేయించాలని కర్ణాటక మాల మహాసభ అధ్యక్షుడు ఎల్ నాగేశ్వరరావు కోరారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న కులగణన సర్వేలో మాల సామాజికవర్గానికి చెందినవారంతా నమోదులో స్పష్టంగా నమోదు చేయించాలని ప్రకటనలో కోరారు. కులంతోపాటు ఉపకులంలోనూ మాల అనే పదాన్ని నమోదు చేయాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆది ఆంధ్ర, ఆది కర్ణాటక, ఆది ద్రావిడ పేర్లు నమోదు చేయరాదన్నారు.

ఆరోగ్యానికి ఆయుర్వేదమే మూలం: చైర్మన్

రాయచూరు సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మారుతున్న వాతావరణ స్థితిగతులు జీవన విధానాల నేపథ్యంలో సంపూర్ణ ఆరోగ్యం ఆయుర్వేదంతోనే సాధ్యమని మహానగర పాలిక చైర్ పర్సన్ నరసమ్మ మాడగిరి అన్నారు. ప్రాచీన వైద్యమైన ఆయుర్వేదం ద్వార మెరుగైన చికిత్సలు లభించే అవకాశం ఉందని ఆ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని వైద్య ఆరోగ్య శాక కార్యాలయం వద్ద జాతీయ ఆయుర్వేద దినాచరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆయుష్ అధికారి తదితరులు ఆయుర్వేదం ప్రాముఖ్యతను వివరించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	10.632	10,564
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,427	10,144
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.77

గ్రామసభలో ప్రజాభిప్రాయ సేకరణ

కంప్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏకుబెంచి గ్రామ పంచాయతీ పరిధిలోని వేణి వీరాపురం గ్రామ పంచాయతీ అధికారులు గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఆ గ్రామసభలో ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో కుడితిని పట్టణ పంచాయతీ పురసభ అవుతుండటంతో వేణి వీరాపురం గ్రామాన్ని కుడితిని పట్టణంలోకి చేర్చారు. తమకు గ్రామ పంచాయతీలోనే తమ గ్రామాన్ని ముందుకు కొనసాగించాలా లేదా అనే అభిప్రాయం మీదే తమ గ్రామంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని పంచాయతీ అభివృద్ధి అధికారి రామాలీ తెలిపారు. అనంతరం గ్రామస్తులు గురుమూర్తి నారాయణప్ప ఆదిమూర్తి హనుమంతప్ప ఆనంద, వెంకటేష్, అనిల్, మహేష్ తదితరులు మాట్లాడుతూ తమ గ్రామం, తాలుకా మాత్రం బళ్లారి, పంచాయతీ మాత్రం కురుగోడు తాలుకాకు చెందిందన్నారు. కురుగోడు తాలుకాలో గ్రామ పంచాయతీ వుండటం వల్ల ప్రతి చిన్న పనికి కురుగోడుకి వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడితే కురుగోడుకు వెళ్లాలంటే ఎంతో కష్టంగా మారింది. కనుక తమ గ్రామాన్ని కుడితిని పట్టణంలోనే చేర్చాలని ప్రజలు అంగీకారం తీసుకున్నారు. ప్రజలిచ్చిన ఆదేశాలపై అధికారులకు తెలియజేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షులు మాలమ్మ, ఉలుగప్ప పంచాయతీ సభ్యులు జగ్గయ్య, నీలమ్మ, రుక్మిణి, ఉమాకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అలరించిన పురాణ పఠనం



పురాణ పఠనంలో వక్తలు

బళ్లారిరూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కురుగోడు తాలుకా పటాన్‌చెరువు గ్రామంలో దేవీ నవరాత్రుల సందర్భంగా పురాణ పఠనం ఏర్పాటు చేశారు. అంబాదేవి సద్గురు మానప్ప తాత శ్రీ శివానంద భారతి రాష్ట్ర ఆధ్వర్యంలో పురాణ కార్యక్రమాన్ని తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పురాణ కార్యక్రమానికి గ్రామప్రముఖులు, పెద్దలు విశేషంగా హాజరయ్యారు.



అలంకరణలో చిన్నదుర్గమ్మ



వాసవీమాత



ఎర్రితాత



పేట ఆంజనేయ స్వామి

కాత్యాయనీ నమోస్తుతే..!

బళ్లారి సిటీ/రూరల్/సిరుగుప్ప/తోరణగల్లు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లాలో నవరాత్రి రెండవ రోజు అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. నగరంలోని పటేల్‌నగర్‌లోని చిన్నదుర్గమ్మ ఆలయంలో 10వ సంవత్సర వార్షికోత్సవం సందర్భంగా రెండవరోజు కాత్యాయిని అలంకారంతో దర్శనమిచ్చారు. అదేవిధంగా బెంగళూరురోడ్డులోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో దేవికి గాజుల అలంకారం, ఎస్‌ఎల్‌వీ కల్యాణ మంటపంలో దేవికి భీమవరం మావులమ్మ అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పౌర సేవకుల సేవలు అమోఘం: ఎమ్మెల్యే



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

బళ్లారి సిటీ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేశం, రాష్ట్రం అందంగా పరిశుభ్రంగా ఉండాలంటే పౌర కార్మికుల సేవలు కీలకమని, పౌర కార్మికులే నిజమైన కార్మికులు అని నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి అన్నారు. పట్టణాభివృద్ధిశాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టరేట్, మున్సిపల్ కార్పోరేషన్ సహకారంతో నగరంలోని వాల్మీకి భవన్‌లో మంగళవారం నిర్వహించిన పౌర కార్మికుల దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నగర పరిశుభ్రతతను కాపాడుకునే బాధ్యత కార్మికులపై ఉందని, గాలి వాన, ఎండ చలితో సంబంధం లేకుండా ప్రతిరోజు తెల్లవారుజాము నుంచే పారిశుద్య పనులు చేపట్టే వారు నిజంగా గొప్పవారన్నారు. నగరంలో ఇప్పటికే 130 మంది పౌరకార్మికులకు శాశ్వత ఉద్యోగాలు ఇచ్చామన్నారు. మేయర్ ముల్లంగి నందీశ్ మాట్లాడుతూ పౌరకార్మికుల కృషి వల్ల మన గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉన్నాయన్నారు. ఈసందర్భంగా జిల్లాకలెక్టర్ నాగేంద్రప్రసాద్, మంజునాథ్, డిప్యూటీ మేయర్ సుకుమ్, సఫాయి కర్మచారి సభ్యుడు రాముడు, మాజీ మేయర్ రాజేశ్వరీ, చైర్మన్ పద్మరోజ, కార్పోరేషన్ సభ్యులు సిబ్బంది , పౌరకార్మికులు పాల్గొన్నారు.

సహకార సంఘాలతోనే రైతులకు న్యాయం

● సొసైటీ అధ్యక్షుడు నాగేంద్రప్ప

కంప్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వుండే సహకార సంఘాల అభివృద్ధికి అందరూ సహకరించాలని హందిహాల్ ప్రాథమిక కృషిపత్తిన సహకార సంఘం సొసైటీ అధ్యక్షుడు నాగేంద్రప్ప కోరారు. కురుగోడు పరిధిలోని హందిహాళ్ గ్రామంలో సోమవారం జరిగిన వార్షిక మహాజన సభ సమావేశం పాల్గొని తెలిపారు. అనంతరం సొసైటీ కార్యదర్శి వెంకటేష్ 2024-25 లెక్క పట్టిని చదివి వినిపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘంలో 1306 మంది సభ్యులు ఉన్నారని, దాదాపు రూ.76.45 లక్షలు వాటా మూలధనం వుందని రూ. 16.78 లక్షలు డిపాజిట్ వుందని తెలిపారు. ఇది 481 మందికి దాదాపు రూ.5.49 కోట్ల కేసీసీ పంట రుణాలను పంపిణీ చేశామన్నారు. రూ. 18.19 లక్షలు ట్రాక్టర్ రుణాలు ఎనిమిది మందికి పంపిణీ చేయబడ్డాయి. 22 మందికి రూ. 9.72 లక్షలు బీడీపీ రుణాలు, 40 మందికి దాదాపు రూ. 14.40 లక్షలు పాడి పరిశ్రమకు రుణాలు పంపిణీ చేయబడ్డాయి. 2024-25 సంవత్సరంలో ఈ సంఘం సుమారు రూ.2.23 లక్షలు లాభాన్ని సొసైటీ కొనసాగుతుందన్నారు.

ఒత్తిడికి లోనుకావద్దు: మేయర్



ధ్వనంతరి చిత్రపటం నివాళులర్పిస్తున్న మేయర్ నందీశ్ తదితరులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత జీవనశైలిలో ప్రతి ఒక్కరూ ఒత్తిడికి లోను కాకుండా, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యమని మహానగర మేయర్ ముల్లంగి నందీశ్ అన్నారు. మంగళవారం నగరంలోని జిల్లా పరిషత్‌లోని ఆడిటోరియంలో ప్రజలకు, ప్రపంచానికి ఆయుర్వేదం నినాదంతో జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయతీ , జిల్లా ఆయుష్ శాఖ నిర్వహించిన 10వ జాతీయ ఆయుర్వేద దినోత్సవ వేడుకలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ధన్వంతరి భగవానుడి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించి మాట్లాడారు. ఆయుర్వేసూత్రాలు, ఔషధి మూలికలు, జీవనశైలి పద్ధతుల గురించి అవగాహన కల్పించడం , ప్రపంచవ్యాప్తంగా ఆయుర్వేదం యొక్క ప్రాముఖ్యతను ప్రోత్సహించడం ఆయుర్వేద దినోత్సవం ప్రధాన ఆశయం అన్నారు. జిల్లా హామీ పథకం అమలు అథారిటీ చైర్మన్ చిదానందప్ప ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆయుర్వేదం అధ్యాత్మిక ఆధారిత వైద్య విధానం అని ఇది భారతీయ మూలాల నుంచి వచ్చిన వారసత్వమన్నారు. ప్రస్తుతం పాశ్చాత్యవైద్య విధానాలపై ఆధారపడటం విచారకమని ఆంతోళన వ్యక్తం చేశారు. అనంతరం ధన్వంతరి శ్లోక పారాయణం చేశారు. ఔషద మొక్కలను ప్రతీకాత్మకంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆయుర్వేద వైద్యుల సంఘం జిల్లా యూనిట్ అధ్యక్షురాలు డాక్టర్ భారతి, సీనియర్ వైద్యాధికారి డా.విజయేంద్ర ఆచార్య, డా. పణేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

హోసూరు జోన్



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

ఫ్లై ఓవర్‌ను పరిశీలించిన కలెక్టర్

హోసూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): హోసూరు పాతలపల్లి కూరగాయల మార్కెట్ సమీపాన ఫ్లై ఓవర్‌ను కలెక్టర్ దినేశ్‌కుమార్ స్వయంగా పరిశీలించారు. ఎస్పీ తంగదురై, జాతీయ రహదారులశాఖ అధికారులతో కలసి మంగళవారం పరిశీలనలు చేశారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణం, ట్రాఫిక్‌రద్దీ నియంత్రణకు తగిన చర్యలపై చర్చించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. సబ్‌కలెక్టర్ ఆకృతి, హోస్టియా సంఘం అధ్యక్షుడు మూర్తి, కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి వడివేలు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

హోసూరు (క్రైం), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సరిహద్దులోని కొత్తకొండపల్లి గ్రామంలో చెక్‌పోస్ట్ వద్ద పెట్రోలింగ్ వేళ నడిచి వెళ్తున్న ఇద్దరు కార్మికులను మాదిగిరి పోలీసులు తనిఖీలు చేశారు. బిహార్‌కు చెందిన పవన్‌కుమార్ (20), మరో వ్యక్తి గణేశ్ దాస్ (45)లనుంచి 5 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీరికి గంజాయి ఎవరు సరఫరా చేస్తున్నారు, వీరు ఎక్కడికి చేరవేస్తున్నారు తదితర అంశాలపై ఆరా తీస్తున్నారు. గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

కెలవరపల్లి డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో

హోసూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాతోపాటు ఎగువన ఉండే కర్ణాటక ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడంతో కెలవరపల్లి డ్యాంకు ఇన్‌ఫ్లో పెరిగింది. 1248 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా డ్యాం నుంచి 5 స్లూయిస్ గేట్‌ల ద్వారా 1366 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం సామర్థ్యం 44.28 అడుగులు కాగా 41.00 అడుగల మేర నీరు నిల్వ ఉన్నట్టు సమాచారం. డ్యాం నుంచి నీరు విడుదల చేస్తున్న నేపథ్యంలో కాలువ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ శాఖ అధికారులు ప్రకటించారు.



డ్యాం నుంచి విడుదలవుతున్న నీరు

26న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న సీఐయూటీయూసీ నాయకులు దేవదాస్, డాక్టర్ ప్రమోద్ తదితరులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న జిల్లాకలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపనున్నట్లు ఏఐయూటీయూసీ జిల్లాధ్యక్షుడు ఏ.దేవదాస్, జిల్లాకార్యదర్శి డా.ప్రమోద్ తెలిపారు. మంగళవారం పత్రికాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగుల కష్టాలు తీవ్రంగా మారాయని, కనీస వేతనం, పీఎస్, సెలవు, ఈఎస్ఐ అనేక ఇతర చట్టపరమైన ప్రయోజనాలు లభించడం లేదన్నారు. కొన్నిచోట్ల చట్టానికి విరుద్ధంగా 12గంటలకుపైగా పని చేయిస్తున్నారని, ప్రశ్నిస్తే ఉద్యోగాలు కోల్పేయే అభద్రతతో పని చేయాల్సి వస్తోందన్నారు. వారిని పర్మినెంట్ చేయాలన్న హైకోర్టు ఆదేశాలు సైతం ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈలోగా కాంట్రాక్ట్ దోపిడీక వ్యతిరేకంగా. నిరంతర పోరాటం ఒత్తిడి కారణంగా రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల బహుళార్థసాధక సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ సందర్భంగా వారు పలు డిమాండ్లు ప్రభుత్వం ముందు ఉంచారు.

● ఔట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేసి కార్మికుల సేవలను పర్మినెంట్ చేయాలి. అప్పటి వరకు విబాగాలు నేరుగా వేతనాలు చెల్లించాలి,సేవా భద్రత కల్పించాలి. ● ప్రభుత్వ శాఖలు ,కార్పోరేషన్ బోర్డులల బహుళార్థసాధక కార్మికుల సహకార సంఘాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలి. ● కనీస వేతన పెంపునకు సబందించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ముసాయిదా నోటిఫికేషన్‌ను విడుదల చేయాలి ● బళ్లారిలో అన్ని సౌకర్యాలతో కూడిన ఈఎస్ఐ ఆసుపత్రిని ప్రారంభించాలి. ● నేటిధరకులకు అనుగుణంగా ఈఎస్ఐ, పీఎఫ్ ప్రయోజనాల పరిమితిని పెంచాలి. ● కాంట్రాక్టు కార్మికులందరికీ కనీస వేతనం రూ.36,000 నిర్ణయించాలని కోరారు. ఏఐయూటీయూసీ ఉపాధ్యక్షులు సోమశేఖర్ గౌడ, శాంతా, కార్యదర్శి సరేశ్, శర్మాస్, మురళి, చేతన్, కిరణ్‌కుమార్, పార్వతమ్మ,పుష్పవతి పాల్గొన్నారు.

కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం: ఎమ్మెల్యే



పౌర కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కంప్లి పురసభలో విధులు నిర్వహిస్తున్న పౌర కార్మికులకు ప్రాధాన్యం కల్పించాలని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని పురసభ ప్రాంగణంలో పౌర కార్మికులకు కార్మికుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ పురసభ కార్మికులకు ఇల్లు స్థలాలు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఇప్పటికే మారుతినగర్‌లోని సీఏ స్థలంలో సుమారు రూ. 29 లక్షల వ్యయంతో పురసభ కార్మికుల కోసం విశ్రాంతి భవనం నిర్మాణానికి నూతన కట్టడం ప్రారంభమైందన్నారు. పురసభ కార్మికులు తమ విద్య, ఆర్థిక, సామాజిక అభివృద్ధితో సమాజంలోని ముందుకు రావాలన్నారు. కార్మికులు పిల్లలకు మొబైల్ ఫోన్‌లకు బదులుగా పుస్తకాలు ఇచ్చినప్పుడు జ్ఞాన సమపార్జన సాధ్యమవుతుందని తెలిపారు. సమాజ మార్పుకు విద్య ఎంతో ముఖ్యమన్నారు. తల్లిదండ్రుల పాత్ర మంచి నైతికత సంస్కృతిని పెంపొందించడం, చెడు అలవాట్లకు దూరంగా వుండి మంచి జీవితాన్ని నిర్మించుకోవాలన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా వుంచేందుకు శ్రమిస్తున్న పౌర కార్మికులకు సౌకర్యాలు కల్పించేందుకు మున్సిపల్ అధ్యక్షులు బట్టప్రసాద్ అన్నారు. ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్య అధికారి బి మల్లికార్జున, మున్సిపల్ సభ్యులు, సీఆర్ హనుమంతు, కేఎస్ చాంద్ బాషా, వీరాంజనేయపీఎంసీ అధ్యక్షులు హబీబ్ రెహమాన్, రెవెన్యూ అధికారి ప్రశాంత్, శరణప్ప, హెల్త్ ఇన్స్‌పెక్టర్ ప్రకాష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్

వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించాలి

● సన్నాహక సమావేశంలో కలెక్టర్ నాగేంద్రప్రసాద్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): అక్టోబరు 7న జరిగే మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని అర్థవంతంగా జరుపుకునేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల సన్నాహాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్‌అన్నారు. మంగళవారం పాత జిల్లాకలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రాథమిక సమావేశానికి అయన అధ్యక్షత వహించి మాట్లాడారు. వాల్మీకి జీవిత చరిత్రను సమాజానికి ఆయన చేసిన సేవలను ప్రస్తుత తరానికి చాటి చెప్పేలా జయంతి కార్యక్రమాలను జరుపుకోవాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అందరి సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పరిసరాలు పరిశుభ్రత, అలంకరణపై శ్రద్ధ వహించాలని మున్సిపల్ కార్పోరేషన్ అధికారులను ఆదేశించారు. కనకదుర్గమ్మ ఆయలం నుంచి బెంగ ళూరు రోడ్డులోని గడిగి చెన్నప్ప సర్కిల్ నుండి ఓల్డ్ బ్రూస్‌పేట పోలీస్ స్టేషన్, తేరువీధి, గవియప్ప సర్కిల్ నుండి జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరం వరకు ఊరేగింపు ఉంటుందన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో వివిధ రంగాల్లో విజయం సాధించిన ప్రముఖులను సత్కరిస్తారు. పదవతరగతి, పీయూసీలో అత్యధిక మార్కులు సాధించిన సమాజానికి చెందిన విద్యార్థులు, ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను సత్కరిస్తామన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులు, సిబ్బంది,ప్రజలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ఈసందర్భంగా జిల్లాపోలీస్ సూపరింటెండెంట్ శోభారాణి, అదనపు జిల్లా కలెక్టర్ మహమ్మద్ జుబేరా, మున్సిపల్ కమిషనర్ మంజునాథ్, జిల్లా పంచాయతీ డిప్యూటీ సెక్రటరీ శశికాంత్ శివపురే, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి రాజుతోపాటు జిల్లా తాలూకా స్థాయిలోని వివిధ శాఖల అధికారులు ,జిల్లాలోని వివిధ పంఘాలు, సంస్థల అధ్యక్షులు ,ఆఫీస్ బేరర్లు , సంఘ నాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై బీజేపీ సంబరాలు



స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వివిధ వస్తువులు, సేవలపై పన్ను రేటును తగ్గించి సవరించిన జీఎస్టీ సోమవారం నుంచి అమల్లోకి వచ్చిన సందర్భంగా మంగళవారం నగరంలో బీజేపీ సంబరాలు చేసుకున్నారు. నగరంలోని బ్రూస్‌పేట సర్కిల్లో కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించి పేదలపై భారాన్ని తగ్గించడం హర్షణీయమన్నారు. దీని ద్వారా ప్రభుత్వం సామాన్యులకు సహాయం చేసిందని, దీని వల్ల వ్యాపారవేత్తలకు కూడా ప్రయోజనం కలిగిందన్నారు. ఈ సందర్భంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు అనిల్ కుమార్, బీజేపీ ప్రధాన కార్యదర్శి దివాకర్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

బళ్లారి సిటీ/రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలోని కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో హిందూ మత ధార్మిక దేవాదాయ శాఖ, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం దసరా మహోత్సవాన్ని ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనకదుర్గమ్మ అమ్మవారి సిడి బండి ఉత్సవాల్లో నగరంలోని అన్ని కులాలు మతాలకు అతీతంగా ప్రజలు పాల్గొంటారని, కనకదుర్గమ్మ అమ్మవారి కృప జిల్లా ప్రజలందరిపై ఉందన్నారు. కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ బళ్లారి జిల్లాకు రాష్ట్రంలోనే కీలకమైన స్థానం ఉందని, ఇక్కడ పని చేయడం ఎంతో అదృష్టమన్నారు. మాతృ కనకదుర్గమ్మ మన జిల్లా, దేశ ప్రజలకు సుఖ సంతోషాలు, శ్రేయస్సు, సంపద ఆనందాన్ని ప్రసాదించాలని అని ఆకాంక్షించారు. మేయర్ ముల్లంగి నందీశ్, జిల్లా అదనపు కలెక్టర్ మహ్మద్‌జేబేరా, ముజ్రాయి శాఖ హనుమంతప్ప, డివిజనల్ అధికారి ప్రమోద్ ,కార్పోరేషన్ సభ్యుడు పి.గాదెప్ప, హనుమంతప్ప, రామాజంనేయులు పాల్గొన్నారు.

కులగణన సర్వేలో కమ్మ అని నమోదు చేయాలి

● సంఘం తాలుకా అధ్యక్షుడు జాలాది రాధాకృష్ణ



సిరుగుప్ప, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో తాలుకా వ్యాప్తంగా కమ్మ కుల బాంధవులు విద్య, సామాజిక పరంగా ముందడుగు కోసం కమ్మ అని నమోదు చేసుకోవాలని కమ్మసంఘం తాలుకా అధ్యక్షులు జాలాది రాధాకృష్ణ పిలుపునిచ్చారు. కమ్మసంఘం భవనంలో ఆయన మాట్లాడుతూ నేటి రోజుల్లో ప్రభుత్వ పథకాల సౌలభ్యం కోసం సౌకర్యాల కోసం సామాజిక, ఆర్థిక, విద్య పరంగా కమ్మ అని రాయించాలని ఆయన పిలుపునిచ్చారు. సర్వే అధికారులకు అందరూ సహకరించాలన్నారు.

ఘనంగా పౌర కార్మికుల దినోత్సవం

సిరుగుప్ప, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పౌర కార్మికుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సిరుగుప్ప పట్టణం నగరసభ ఆధ్వర్యంలో పౌర కార్మికుల జయంతిని నిర్వహించారు. కార్యాలయం నుంచి ప్రధాన రహదారిలో సత్యక్క భావచిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. నగరసభ కమీషనర్ గంగాధర, ఎడబలి రమేష్, ఆధ్వర్యంలో ఊరేగింపు కొనసాగింది. పౌర కార్మికులు కోలాహలంగా డ్యాన్సులు వేశారు. మేళతాళాలు, డోలు డమరుకాలతో ఊరేగింపు నిర్వహించారు. నగరం పరిశుభ్రంగా వుండాలంటే పౌర కార్మికుల పాత్ర ఎంతో వుందని నగరసభ కమిషనర్ అన్నారు. ఈ సందర్భంగా నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ, ఉపాధ్యక్షురాలు యశోద, సముదాయ అధికారి అమరేశప్ప, కార్మికులు వెంకోబ, పంపాపతి, శంకర్‌గౌడ పాల్గొన్నారు.

నేటి నిరసన వాయిదా

హోస్పేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సబ్సిడీ రుణాల ముసుగులో సామాజిక సేవ పేరుతో నగరాన్ని కోట్లాది రూపాయలు మోసం చేసిన రాజకీయ మహిళా నాయకులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో జరగాల్సిన నిరసన దీక్షను మారడిలోని డీవైఎస్పీ కార్యాయలంలో జరిగిన సమావేశం ఫలితంగా వాయిదా వేసినట్లు దళిత హక్కుల కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంబయ్యనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం కేసును సీఐడీ లేదా సిట్‌కి అప్పగిస్తామని పోలీస్ శాఖ స్థాయిలో ఇచ్చిన హామీ కారణంగా ధర్నా సత్యాగ్రహాన్ని వాయిదా చేశామన్నారు. డీవైఎస్పీ కార్యాలయంలో జరిగిన చర్చ కార్యక్రమంలో ఆర్ భాస్కర్‌రెడ్డి, మారడి జంబయ్యనాయక్, యల్లలింగ, నాగరత్నమ్మ, కె మల్లికార్జున, వినోద్, వందన, ఎప్‌వాణి, భారతి, అన్నపూర్ణ, వేదవతి, పద్మ, సంగీత, కావేరి, రేణుక, రాధ, లత, సునీత, మేఘా పాల్గొన్నారు.